జ్వాల
దశ
నిజం.. నిర్భయంగా..
గురువారం 21-05-2026
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
ఖమ్మం వైరా | సత్తుపల్లి | పాడేరు | మధిర
భద్రాద్రి కొత్తగూడెం కొత్తగూడెం | ఇల్లందు | పినపాక | భద్రాచలం | అశ్వరావుపేట
WWW.DASHANEWS.COM




# SIR మ్యాపింగ్ ప్రక్రియకు రాజకీయ పార్టీల సహకారం అవసరం

- ❖ బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాలు వెంటనే సమర్పించాలి
- ❖ భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్



**దశ, కొత్తగూడెం:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టనున్న ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు తమ బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాలను వెంటనే సమర్పించాలని సూచించారు. బీఎల్‌వోలు నిర్వహించే ఇంటింటి సర్వే కార్యక్రమానికి రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. జూన్ 2026 నుండి బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని, ప్రతి ఓటరు ఇంటిని కనీసం ఒక్కసారైనా సందర్శించి అవసరమైతే మూడు సార్లు వరకు వెళ్లి ఫారాలు సేకరిస్తారని చెప్పారు. ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ ప్రక్రియ జూన్ 26 నుండి ప్రారంభమై 24072026 లోపు పూర్తవుతుందని తెలిపారు. అనంతరం 31 072026న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించి, 31072026 నుండి 30082026 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని చెప్పారు. 01102026న తుది ఓటరు జాబితా ప్రచురణ ఉంటుందని తెలిపారు. చిరునామా మార్పులు, ఇతర సవరణల కోసం ఫారం8 ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ఓటర్లు తమ పేరు ఎస్ఐఆర్2002 జాబితాలో ఉందో లేదో తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ లేదా ఈసీఐ ఓటర్స్ పోర్టల్‌లో “సెర్చ్ బై ఎలెక్టర్ డిటైల్స్” ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఆధార్ నంబర్ ఇవ్వడం పూర్తిగా ఐచ్ఛికమని స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న వారు ఫారం6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చని, 01 అక్టోబర్ 2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకునే వారికీ అవకాశం ఉంటుందని తెలిపారు. ఫారం నింపడంలో లేదా వివరాల ధృవీకరణలో సహాయం కోసం బీఎల్‌వోలు, 1950 హెల్ప్‌లైన్, ఈసీఐ ఓటర్స్ పోర్టల్ మరియు “బుక్ ఏ కాల్ విత్ బీఎల్‌వో” సౌకర్యాలను వినియోగించుకోవచ్చని సూచించారు. విదేశాల్లో లేదా ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగం చేస్తున్న ఓటర్ల తరఫున కుటుంబంలోని పెద్ద సభ్యుడు ఫారం నింపి బీఎల్‌వోకు సమర్పించవచ్చని తెలిపారు. అనంతరం జిల్లా ఎన్నికల మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రాముఖ్యత, ఫారాల నింపే విధానంపై రాజకీయ పార్టీ ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, జిల్లా ఎన్నికల మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి రాంబాబు, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి దేవి ప్రసన్న, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ప్రతినిధి కంచర్ల జమలయ్య, ఎన్నికల సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# మెడికల్ షాప్‌లు బంద్ విజయవంతం

- ❖ మణుగూరు పట్టణంలో ర్యాలీ

**దశ, మణుగూరు:** ఆల్ ఇండియా మెడికల్ షాప్ అసోసియేషన్ పిలుపుమేరకు మంగళవారం మణుగూరు అశ్వాపురం, పినపాక, కరకగూడెం మండలాల్లో మెడికల్ షాపులు నిర్వహించిన బంద్ కార్యక్రమం విజయవంతం అయింది. ఈ సందర్భంగా అసోషియేషన్ నాయకులు మాట్లాడుతూ..ఆన్‌లైన్‌లో మెడిసిన్స్ విక్రయాలు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్‌లో మెడిసిన్ ఆర్డర్లు పెట్టుకొని మెడిసిన్ వాడటం మూలంగా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని సమాజంలో ప్రజలు అర్థం చేసుకొని వైద్యాల సలహా మేరకు మాత్రమే మెడికల్ షాపులలోనే మందులు కొనుగోలు చేయాలని కోరారు. ఆన్‌లైన్ వ్యాపారస్థులు కూడా మెడిసిన్ ఆర్డర్లు తీసుకకుండా వ్యాపారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మణుగూరు డివిజన్ మెడికల్ షాపులలోనే అసోషియేషన్ అధ్యక్షులు నాగేశ్వరరావు, ఎగ్గడి శ్రీరామ్, కృష్ణ, సంతోష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# చరిత్ర తిరగరాయాలి కేసిఆర్‌ను సీఎం చేయాలి



- ❖ పార్టీ సభ్యత్వ నమోదులో ఉత్సాహంగా పని చేయాలి
- ❖ ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు

**దశ, ఖమ్మం:** కేసీఆర్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీకి బలం అని కార్యకర్తలు, నాయకులే బలగమని అని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఖమ్మంలోని తెలంగాణ భవన్ నందు ఎమ్మెల్సీ, పార్టీ ప్రధాన కార్యదర్శి తక్కెళ్లపల్లి రవీందర్ రావు అధ్యక్షతన ఖమ్మం, మధిర, వైరా, ఇల్లందు నియోజకవర్గాల సభ్యత్వ నమోదు మండల ఇంచార్జ్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రలతో కలిసి మాజీ పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అభివృద్ధికి కేసిఆర్ చేసిన కృషిని కొనియాడారు. మరల చరిత్ర తిరగరాసి కేసిఆర్‌ను ముఖ్యమంత్రిగా చేయాలని పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. లక్షలాది మంది కార్యకర్తల బలం ఒక్క బీఆర్ఎస్ పార్టీకే సొంతమన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టిన సమయంలో తాను తొలి ఓటు వేశానని, ఆ సందర్భానికి కేసిఆర్ సాక్షిగా ఉన్నారని గుర్తుచేశారు. గత రెండు దశాబ్దాలుగా ఉద్యమకారులు, కార్యకర్తలు, నాయకులు పార్టీకి అందించిన సేవలు అమూల్యమని పేర్కొన్నారు. జిల్లాలో 10కు 10 అసెంబ్లీ స్థానాలు గెలుచుకోవడం అవసరమని, అందుకు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. యువతను చైతన్యవంతం చేయాలని, మండల ఇంచార్జ్‌లకు భవిష్యత్‌లో పార్టీ ప్రాధాన్యత కల్పిస్తుందని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎలాంటి కష్టాల్లో ఉన్నా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పదవులు లేకపోయినా సేవలందిస్తున్న వారికి పార్టీ తగిన గుర్తింపు, అవకాశాలు కలిపిస్తుందని పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు లో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హరి ప్రియ, డీసీసీబీ మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, పగడాల నాగరాజు, ఆర్జేసి కృష్ణ, దిండిగల రాజేందర్, ఖమర్, మంజుల, గిరిబాబు, మండల, పట్టణ ఇంచార్జిలు పాల్గొన్నారు.

# రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



**దశ, పినపాక :** అన్ని రంగాల్లోనూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయిందని పినపాక పిఏసిఎస్ చైర్మన్ రవి శేఖర్ వర్మ అన్నారు. మంగళవారం ఆయన జానంపేటలో ఏర్పాటుచేసిన సమావేశంలో BRS ప్రభుత్వం ఉన్నప్పుడు రైతును రారాజును చేసినటువంటి కేసీఆర్ ప్రభుత్వమన్నారు. ఇప్పుడు ఉన్నటువంటి ప్రభుత్వం లో రైతులను నిండా ముంచి దగా చేసిన ప్రభుత్వం ఈ ప్రభుత్వానికి వరి ధాన్యం అలాగే మక్కలు కొనే పరిస్థితి లేదన్నారు. తడిసిపోయిన పట్టించుకోని ప్రభుత్వం మంత్రులు మొసలి కన్నీరు కారుస్తున్నారు తడిసినటువంటి వారి ధాన్యం మక్కలను ఎటువంటి తరుగు తీయకుండా వెంటనే ఈ ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి లేని పక్షమున రైతుల పక్షాన ప్రతిపక్ష పార్టీగా కొనుగోలు చేసేంతవరకు పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. అలాగే వరి ధాన్యానికి మక్కలకు రైతులకు ఇస్తానన్నటువంటి బోనస్ ఇవ్వవలసిందిగా పక్షంగా పినపాక మండల వ్యవసాయ రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చినటువంటి 420 హామీలను ఆరు గ్యారెంటీలు. 13 స్కీమ్స్‌అమలుపరిచే వరకు ప్రజల పక్షమున BRS పార్టీ పోరాటం కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు మొగిలిపల్లి నరసింహారావు, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు ఖాయం శేఖర్, ఎస్సీ సెల్ సభ్యులు బోడ సర్వేశ్వరరావు, మైనార్టీ సెల్ సభ్యులు ఎండి యాకూబ్ పాషా, బీసీ సెల్ సభ్యులు బియ్యాల మురళి, సీనియర్ నాయకులు గుండం దామోదర్, మాజీ సర్పంచులు సంగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జానంపేట సర్పంచ్ బాడీశ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి హెల్పింగ్ హ్యాండ్స్ భారీ వితరణ

**దశ, మణుగూరు :** లివర్ ఇన్ఫెక్షన్తో బాధపడుతున్న ఎనిమిది నెలల బాలుడికి భద్రాద్రి హెల్పింగ్ హాండ్స్ సమాజ సేవ సమితి ఆధ్వర్యంలో 90వేలు ఆర్థిక సహకారాన్ని BTPS చీఫ్ ఇంజనీర్ బిచ్చన్న చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. అశ్వాపురం మండలం కళ్యాణపురం గ్రామానికి చెందిన ఆశ్రయ్ అనే బాలుడు లివర్ ఇన్ఫెక్షన్ తో బాధపడుతున్న క్రమంలో భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఉద్యోగులు ఏర్పాటు చేసుకున్న భద్రాది హెల్పింగ్ హాండ్స్ సమాజ సేవా సమితి చారిటీ ప్రభుత్వ గుర్తింపు సంస్థ ఆధ్వర్యంలో మణుగూరు BTPSలో రూ.90 వేలు ఆర్థిక సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో భద్రాది హెల్పింగ్ హాండ్స్ కమిటీ సభ్యులు మురళీకృష్ణ, రమా, శ్రీనివాస్ రెడ్డి, ఆరిఫ్ అహ్మద్, జేఏఓ తదితరులు పాల్గొన్నారు.



# BLOలు ఓటర్ సవరణ జాబితా ప్రక్రియ పూర్తి చేయడానికి సహకరించాలి

- ❖ భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్




**దశ, మణుగూరు :** తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ బూత్‌లో బూత్ లెవల్ అధికారులు ఓట్లు సవరణ ప్రక్రియ సజావుగా జరిగే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ తెలిపారు. మణుగూరు తాహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గంలో 240 పోలింగ్ స్టేషన్ పరిధిలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బందితో ఓటర్ సవరణ మరియు మ్యాపింగ్ ప్రక్రియపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా ఐటీడీఎ పిఓ మాట్లాడుతూ ఓటర్ జాబితా మ్యాపింగ్ ప్రక్రియ నిర్వహణకు రాజకీయ ప్రజాప్రతినిధులు బి.ఎల్.ఓ.లకు సహకరించాలన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో బూత్ ఏజెంట్లను నియమించు కోవాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు అన్ని పోలింగ్ బూత్‌లలో వెంటనే ఏజెంట్లను నియమించుకొని ఓట్ల సవరణ ప్రక్రియకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మణుగూరు తాహసిల్దార్ అద్దంకి నరేష్, ఎలక్షన్ డీటీ అనూష, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# CMRF చెక్కులను పంపిణీ చేసిన పినపాక MLA పాయం వెంకటేశ్వర్లు



**దశ, మణుగూరు :** మణుగూరు మండలానికి చెందిన లబ్ధిదారులకు మంగళవారం ప్రజాభవన్‌లో 17 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. సుమారు రూ.12 లక్షల విలువైన చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పేదప్రజలను ఆదుకునేందుకు పని చేస్తుందన్నారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న భాధితులకు అండగా ఉండేందుకు ఈ CMRF పధకం పనిచేస్తుందన్నారు. ఎంతోమంది లబ్ధిదారులకు అండగా ఉంటూ వారి కుటుంబాల్లో ధైర్యం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# పాల్వంచ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**దశ, పాల్వంచ :** రోడ్డు ప్రమాదాలు మరియు సైబర్ నేరాలపై పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు నిత్యం అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. మంగళవారం ఆయన పాల్వంచ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ సీఐ సతీష్ కుమార్, ఎస్సైలు టి.నాగరాజు జీ.విజయ, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# BRS పార్టీ సభ్యత్వ నమోదులో విస్తృతంగా పాల్గొనాలి

- ❖ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జ్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు




**దశ, భద్రాచలం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో BRS పార్టీ సభ్యత్వ నమోదులో ప్రతి కార్యకర్త విస్తృతంగా పాల్గొని అధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జ్ తక్కళ్లపల్లి రవీందర్‌రావులు అన్నారు. మంగళవారం భద్రాచలంలో జరిగిన మండల సమన్వయకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భద్రాచలం, అశ్వారావుపేట నియోజకవర్గాల సమన్వయకర్తలను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ BRS పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు పకడ్బందీగా పనిచేయాలన్నారు. ప్రతి పోలింగ్ బూత్ లెవల్‌లో ఏజెంట్లుగా మన పార్టీకి చెందిన ముఖ్యమైన కార్యకర్తలను మాత్రమే నియమించాలన్నారు. ముఖ్య నాయకులకు, కార్యకర్తలకు క్రియాశీలక సభ్యత్వం ఇవ్వాలని, సాధారణ కార్యకర్తలకు సాధారణ సభ్యత్వం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరావు, తాటి వెంకటేశ్వర్లు, మానె రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్, నర్సింహారావు, వాసుబాబు ముఖ్యనాయకులు తదితరులు పాల్గొన్నారు.